క్లుప్తంగా

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి



గుడివాడరూరల్: పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ ఆర్‌జేడీ టెలి కాన్ఫరెన్స్‌లో పట్టణంలోని పలు సమస్యలపై మంగళవారం చర్చించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. అధికారులు పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.

కలుషిత నీటితో అనారోగ్య సమస్యలు



మండవల్లి: మండవల్లి రక్షిత తాగునీటి పథకానికి నీటిని సరఫరా చేసే స్థానిక సెంటర్‌లోని మంచినీటి చెరువు గట్టు చుట్టూ పిచ్చి మొక్కలు, తుప్పలు దట్టంగా పెరిగి నీరు కలుషితమవుతోంది. ఈ మొక్కలను ఆశ్రయించే క్రిమి, కీటకాలు, ఎండిన ఆకులు చెరువు నీటిలో కలిసి కలుషితమై రక్షిత మంచినీటి పథకానికి వెళ్తోందని స్థానికులు తెలిపారు. కుళాయిల ద్వారా వస్తున్న నీటిని తాగడంతో అనారోగ్య సమస్యలు పెరిగాయని గ్రామస్తులు అంటున్నారు. చెరువు గట్టుపై పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించేందుకు గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి



పమిడిముక్కల: ఉద్యోగులు వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తాడంకి హైస్కూల్లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన నైనవరపు రాజును మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, హెచ్‌ఎం ప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఉద్యోగ నిర్వహణలో తనకు సహకరించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

కలిదిండి(కైకలూరు): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని కలిదిండి ఎస్‌ఐ వి.వేంకటేశ్వరరావు మట్టగుంటలో మంగళవారం అరెస్టు చేశారు. పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ మట్టగుంట సెంటర్‌లో కటికతల జాన్ అనే వ్యక్తి అక్రమంగా ఎనిమిది మద్యం సీసాలను తన వద్ద ఉంచుకుని విక్రయిస్తున్నాడని తెలిపారు. పోలీసు సిబ్బందికి సమాచారం రావడంతో అతడిని అరెస్టు చేశామన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించారని పేర్కొన్నారు.

విద్యార్థినులకు భోజనశాల వసతి



గుడ్లవల్లేరు: అంగలూరు బాలికోన్నత పాఠశాలలో భోజనశాల స్టోర్ రూమ్‌లా అపరిష్కృతంగా ఉండేసరికి లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో దాతలు ఆ సమస్యను పరిష్కరించారు. మంగళవారం విద్యార్థినులకు తమ భోజనశాలను అందుబాటులోకి తెచ్చారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, క్లబ్ కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు పాల్గొన్నారు.

మొగలి చెరువులో చేపల వేటకు వేలం

మండవల్లి: మండవల్లిలోని స్టేషన్‌రోడ్డులో ఉన్న రెండో మంచినీటి చెరువు మొగలి చెరువులో చేపల పట్టుబడికి మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. మండవల్లికి చెందిన దూసనపూడి నాంచారయ్య అత్యధికంగా రూ.2.11 లక్షలకు వేలం దక్కించుకున్నారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, మెండా సురేష్, కార్యదర్శి కొండలు పాల్గొన్నారు.

సామాన్యులకు అందని ఉచిత ఇసుక

- లంకపల్లి రీచ్‌లో జోరుగా వ్యాపారం
- ట్రాక్టర్ ఇసుక లోడింగ్‌కు రూ.3 వేలు
- రూ.6 వేలకు ట్రాక్టర్ ఇసుక విక్రయం





లంకపల్లి రీచ్‌లో ఇసుక లోడింగ్‌కు వెళుతున్న ఎడ్లబళ్లు (ఇన్‌సెట్) లంకపల్లి రీచ్ వద్ద ఎడ్లబళ్ల నుంచి ట్రాక్టర్‌లోకి ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

పమిడిముక్కల: మండల పరిధిలోని లంకపల్లి రీచ్‌లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఎడ్లబళ్లు, ట్రాక్టర్ల ద్వారా రీచ్‌లనుంచి ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చంటూ ప్రభుత్వం ప్రకటించడం.. ఇసుక వ్యాపారులకు వరంగా మారింది. సామాన్యులకు మాత్రం ఇసుక అందని పరిస్థితి నెలకొంది. ఎడ్లబళ్ల ద్వారా ఇసుకను తీసుకొచ్చి ట్రాక్టర్లలోకి లోడ్ చేస్తున్నారు. మచిలీపట్నం, పెడన తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లతో వచ్చి ఇసుకను తరలించుకు పోతున్నారు.

వ్యాపారులకు ఫుల్

రీచ్ వద్ద ఎడ్లబళ్ల ద్వారా ట్రాక్టర్ ఇసుక లోడింగ్‌కు రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. ఈ ఇసుకను ట్రాక్టర్ల డ్రైవర్లు బయటకు తీసుకెళ్లి రూ.6 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వ్యాపారులకు ఫుల్‌గా ఇసుక లభిస్తుండగా, అవసరమున్న వారికి మాత్రం రేవులోకి వెళ్లి ఇసుక తెచ్చుకునే పరిస్థితి లేదు. రీచ్ వద్ద రెవెన్యూ, పోలీసులకు డ్యూటీలు వేసి, ఇసుక వ్యాపారాన్ని అరికట్టి, అవసరమున్న వారికి ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా ఇసుకపై జీఓ జారీ అయిందని పేర్కొన్నారు.

నాగిరెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



నాగిరెడ్డిని పరామర్శిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

గుడివాడరూరల్: ఇటీవల అనారోగ్యంతో వైద్య చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న రాష్ట్ర వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి పరామర్శించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని నాగిరెడ్డి స్వగృహానికి సజ్జల, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ దేవినేని అవినాష్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ తమ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నాగిరెడ్డిని పరామర్శించేందుకు వచ్చామన్నారు. ఎటువంటి రాజకీయ కారణాలు లేవన్నారు. నాగిరెడ్డి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకుని తమ అధినేతకు వివరిస్తామని స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



బస్టాండ్ సెంటర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

గుడివాడరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని కాలుష్య నియంత్రణ మండలి(విజయవాడ) కళాజాత బృందం సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్, బంటుమిల్లిరోడ్ తదితర ప్రాంతాల్లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రజలకు మంగళవారం తమ పాటలు, ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీపావళి సందర్భంగా జిల్లాలోని ప్రజలకు పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించేందుకే తాము అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీపావళి అంటే బాణసంచాను కాల్చడం అని చాలా మంది భావిస్తారన్నారు. అయితే దీపావళి అంటే దీపాలంకరణ పండుగ అని చాటే చెప్పేలా తాము ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బృంద సభ్యులు వీరయ్య, వై.నాగేంద్ర, రవితేజ, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికంగా పురుగుమందులు పిచికారీ చేయొద్దు

సీనియర్ శాస్త్రవేత్త సుధారాణి



గురజాడలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

పమిడిముక్కల: పురుగు ఉద్ధృతిని బట్టి మాత్రమే పురుగుమందులను పిచికారీ చేయాలని, అధికంగా పురుగుమందులు పిచికారీ చేయవద్దని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి రైతులకు సూచించారు. మండలంలోని గురజాడ, కపిలేశ్వరపురం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వరి పైరును పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు. వరిపైరుకు మానుగాయ తెగులు ఆశించి నట్లయితే టిల్ట్ ఎకరాకు 200 మిలీ లీటర్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఏఓ గణేష్‌రెడ్డి మాట్లాడుతూ రాయితీపై మినుము విత్తనాలు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

కలిదిండి(కైకలూరు): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధిలో మండలాన్ని ముందు వరుసలో నిలబెట్టాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అన్నారు. కలిదిండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన సమావేశ హాల్లో మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ప్రజలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో రహదారులు ఇటీవల వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. ముందుగా వాటి మరమ్మతులు చేయాలన్నారు. ప్రధానంగా గృహ నిర్మాణశాఖ అధికారులు పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, డ్రెయిన్లు, నీటి పారుదల, విద్య, అంగన్‌వాడీలు పలు అంశాలపై చర్చ జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఎంపీడీఓ దినేజ్, తహసీల్దారు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల మనోభావాలను దెబ్బతీయవద్దు



కైకలూరు కరకట్ట వద్ద పొక్లెయిన్‌తో చేపట్టిన పనులను నిలుపుదల చేయాలంటున్న దళిత క్రైస్తవులు

కైకలూరు: నూతనంగా కైకలూరు కరకట్ట శివారున ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డు వల్ల సమాధులపై చెత్త, ముంపు బారిన పడే అవకాశం ఉందని దళిత క్రైస్తవులు మండిపడ్డారు. ఇటీవల వైఎస్సార్ నగర్ శివారున 2.8 సెంట్ల భూమిని డంపింగ్‌యార్డుకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఇప్పటి వరకు కైకలూరు పంచాయతీ రోజువారీ చెత్తను ఏలూరురోడ్డు వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్ సమీపంలో రోడ్డు పక్కన వేసేవారు. దీంతో కొద్ది రోజులుగా అక్కడ చెత్తను నూతన డంపింగ్‌యార్డుకు రోడ్డు నిర్మాణం నిమిత్తం తరలిస్తున్నారు. డంపింగ్‌యార్డు సమీపంలో క్రైస్తవుల సమాధులు ఉన్నాయి. సమాధుల వద్ద చెత్త తరలింపు విషయం తెలుసుకున్న దళిత క్రైస్తవ ప్రముఖులు, పాస్టర్లు మంగళవారం పనుల వద్దకు వెళ్లారు. పొక్లెయిన్‌తో అప్పటికే చెత్తను సరి చేస్తున్నారు. కొన్ని సమాధులపై చెత్త పడింది. దీంతో వెంటనే పనులు నిలుపుదల చేయాలని లేదంటే ఆందోళన చేపడతామని వారు అడ్డుకున్నారు. క్రైస్తవ నేతలు దండే రవిప్రకాష్, జాన్ మిల్టన్, తంబాల వినోద్, జొన్నలగడ్డ దేవదాసు, వట్టిప్రోలు ఆనంద్, బందెల లక్ష్మణరావు పాల్గొన్నారు.

పనులు నిలుపుదల చేశాం

బాధితుల ఫిర్యాదుతో పొక్లెయిన్‌తో చేపడుతున్న డంపింగ్ యార్డు పనులను నిలుపుదల చేశామని ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుడికి రూ.10 లక్షల ప్రమాద బీమా

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో పాటు గ్రీన్ అంబాసిడర్లకు ప్రమాద బీమాను చేశారు. ఒక్కో కార్మికుడికి రూ.10 లక్షల చొప్పున మంగళవారం పోస్టల్ శాఖ ద్వారా బీమా చేయించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఇమ్రాన్, గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు, సబ్ పోస్ట్ మాస్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. అభిషేకాలతో పాటు పలువురు దంపతులు తమ పిల్లలకు భారీ సంఖ్యలో అన్నప్రాసనలు చేయించారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన సదస్సు

ముదినేపల్లి రూరల్: కొరగుంటపాలెంలో ప్రకృతి సేద్యంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో రాబోయే రబీ సీజన్‌కు సంబంధించి సేద్యంలో అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. అపరాల సాగులో ప్రకృతి సేద్యంతో తెగుళ్లు, పురుగులను నిర్మూలించే విధానాలను వివరించారు. బ్రహ్మాస్త్రం తయారీ విధానాన్ని, దీని వల్ల పైరుకు కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.

బీసీ బాలుర వసతి గృహం మరమ్మతులకు చర్యలు

మండవల్లి: మండవల్లి ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ ఈఈ ఆధ్వర్యంలో రూ.6.90 లక్షల అంచనా వ్యయంతో నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్‌వీ నాగరాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కైకలూరు ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం మేజర్, మైనర్ మరమ్మతులకు రూ. 8 లక్షల అంచనాలతో ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. నిధులు విడుదలైన వెంటనే మరమ్మతులు పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు.

రైతుల కోసమే రీసర్వే

గుడ్లవల్లేరు: రైతులకు ఉండే భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టామని రీసర్వే డీటీ రత్నకుమారి పేర్కొన్నారు. మండలంలోని అంగలూరులో రీసర్వే గ్రామసభను మంగళవారం నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఉలవలపూడి సర్పంచి పామర్తి కన్య భాస్కరరావు, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, గ్రామ సర్పంచి మేడేపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై అవగాహన సదస్సు

గుడివాడరూరల్: గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల్లో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో కృతిమ మేధస్సుపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన హైదరాబాద్‌కు చెందిన విద్యా సంబంధ నిపుణుడు కొత్తూరి అక్షయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్ మీద నడుస్తుందని దానికి అనుగుణంగా నేటి తరం విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, కళాశాల పాలకవర్గ ప్రెసిడెంట్ ఎల్‌ఆర్‌కె ప్రసాద్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే విజయం తథ్యం

కైకలూరు: విద్యార్థులు లక్ష్యం నిర్ణయించుకుని ప్రణాళికాబద్ధంగా చదివితే విజయాన్ని అందుకోగలరని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి సూచించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశం కాలేజీలో మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుల విషయంలో అధ్యాపకులతో పాటు తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



రోగులకు వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఊపిరితిత్తులు, జనరల్, కిడ్నీ, ఎముకలు, గుండె సంబంధ వైద్య పరీక్షలను వైద్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గుడివాడ శ్రీ సురక్ష మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ వారు సహకారంతో చేపట్టారని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. అలాగే గుడ్లవల్లేరు ఎస్‌ఈఆర్‌ఎం హైస్కూల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి వారు 170మందికి ఈ పరీక్షలను చేశారు. 15మందికి దృష్టి లోపం ఉన్నట్లు నిర్ధారణ చేసి, కళ్లజోళ్లకు సిఫార్సు చేశారు. స్వర్గీయ అరికెపూడి శివహర్ష స్మారకార్థం తండ్రి ఏఆర్‌కే చౌదరి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ శశికళ తెలిపారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, క్లబ్ కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు, లయన్స్ ప్రతినిధులు సూరపనేని పరంధామయ్య, గుమ్మడి రామకృష్ణ పాల్గొన్నారు.

ఖో–ఖో పోటీల్లో జమీగొల్వేపల్లి విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు



ఎంపికైన విద్యార్థులతో పీడీ, హెచ్‌ఎం

జమీగొల్వేపల్లి(పామర్రు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖో–ఖో పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి తమ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు జమీగొల్వేపల్లి హైస్కూల్ హెచ్‌ఎం ఉషారాణి తెలిపారు. మండలంలోని జమీగొల్వేపల్లి జెడ్పీ హైస్కూల్లో విజేతలైన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ అండర్–17 బాలుర విభాగంలో కె.ప్రదీప్, బాలికల విభాగంలో పదో తరగతి విద్యార్థులు కె.ఊర్వ కె.ధనలక్ష్మి, డి ఏసుప్రియ ఎంపికయ్యారని తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో ఎం.అభినాష్, సీహెచ్ ఆకాష్, బాలికల విభాగంలో కె.రేష్మశ్రీ విజేతలయ్యారని పేర్కొన్నారు. వీరు నవంబర్ నెల 2,3,4 తేదీల్లో అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి ఖో–ఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలతోపాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు రవిబాబును ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యనారాయణ స్టాఫ్‌సెక్రటరీ రహమాన్ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఖో–ఖో పోటీలకు కాజ విద్యార్థులు

కాజ(మొవ్వ): గుడివాడ ఎస్‌పీఎస్ పాఠశాల్లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఖో–ఖో పోటీల్లో మొవ్వ మండలం కాజ గ్రామంలోని ఎస్‌పీఎస్‌ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనపరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం టీవీ రమణి తెలిపారు. పాఠశాల ఏడో తరగతికి చెందిన జే అఖిల్, కే గౌతమి జిల్లా జట్టుకి ఎంపికయ్యారని వీరు త్వరలో పల్నాడు జిల్లా కారంచేడులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని పీడీ బసవయ్య తెలిపారు. మంగళవారం పాఠశాల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు జాన్సన్, గురనాథబాబు, రవిశంకర్ పాల్గొన్నారు.

మండవల్లిలో..



ఎంపికైన విద్యార్థినితో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

మండవల్లి: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు లోకుమూడి గరువు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు మంగళవారం పేర్కొన్నారు. 28న గుడివాడ ఎస్‌పీఎస్ స్కూల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఖోఖో బాలికల అండర్–14 విభాగంలో లోకుమూడి హైస్కూల్ విద్యార్థిని యండవల్లి సంజన ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బాలిక నవంబర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు గుంటూరు జిల్లా కారంపూడి వెళ్తారని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు వేణును హెచ్‌ఎం, స్కూల్ సిబ్బంది అభినందించారు.

టీడీపీ నాయకులపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తా

తెలుగుదేశం పార్టీ నాయకుడు, సర్పంచ్ కాకరాల సురేష్

గుడివాడరూరల్: తాను టీడీపీ సర్పంచ్‌గా ఉన్నప్పటికీ కనీసం తన గ్రామంలో పనుల ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించకుండా గుడివాడ తెలుగుదేశం పార్టీ నాయకులు పనులు ప్రారంభించడం బాధాకరమని డివిజన్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, నందివాడ మండలం వెంకటరాఘవాపురం సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు కాకరాల సుభాష్‌చంద్ర బోస్(సురేష్) ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డులోని వైష్ణవి టవర్స్‌లో ఆయన స్వగృహంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెంకటరాఘవాపురంలో సోమవారం పనికి ఆహార పథకం నిధులు రూ.7లక్షలతో రోడ్ల పనులకు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు వచ్చి ప్రారంభించడంతో సర్పంచ్ అయిన తనకు అవమానంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నేతృత్వంలో పని చేస్తున్న కొంతమంది ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. తన గ్రామంలో పనులు చేస్తుంటే అక్కడికి వెళ్లి పంచాయతీరాజ్ ఏఈని పనులు ప్రారంభించే ముందు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించినట్లు తెలిపారు. ఈ పనులను ఎమ్మెల్యే సోదరుడు తులసీబాబు ఈ పనులను టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావుకు అప్పగించారని తెలిపారన్నారు. ఈ విషయాలన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తానని కాకరాల పేర్కొన్నారు.

పెరిగిన టపాసుల ధరలతో ప్రజల బెంబేలు



పామర్రులో టపాసుల దుకాణాలు

పామర్రు: దీపావళి సందర్భంగా మంగళవారం స్థానిక చల్లపల్లి రోడ్డులోని కోటి జగపతి కల్యాణ మండపంలోని ఖాళీ స్థలంలో టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు. దుకాణదారులు అధిక రేట్లతో టపాసులను విక్రయిస్తూ కొనుగోలుదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. పెరిగిన ధరలను చూసి వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. కాగా పండగను ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు పాటించి నిర్వహించుకోవాలని అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితి నెలకున్నా వెంటనే 08674 253120ను సంప్రదించాలని సూచించారు. పామర్రులో ఎనిమిది టపాసుల దుకాణాలు మండల పరిధిలో ఒకటి చొప్పన మొత్తం తొమ్మిది షాపులకు తహసీల్దార్ రవికాంత్ అనుమతులు ఇచ్చారు.

అధిక ధరలతో అవస్థలు

గతేడాది కన్నా ఈ ఏడాది టపాసుల అమ్మకాలను జీఎస్టీల పేరుతో అధిక ధరలకు విక్రయిస్తుండటంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని దుకాణాల్లో గత ఏడాది టపాసులను తెచ్చి విక్రయిస్తున్నారని, దీంతో అవి సక్రమంగా పేలటం లేదని కొనుగోలుదారులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

చట్టాలు, హక్కులపై అవగాహన



కైకలూరు: విద్యార్థి దశ నుంచి బాలబాలికలకు చట్టాలు, హక్కులపై కనీస అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ డాక్టర్ వి.దీప్తి చెప్పారు. ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, చట్టాలు సంక్షేమ పథకాల అమలుపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ మహిళలకు 18, పురుషులకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. చైల్డ్‌లైన్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ రాజు మాట్లాడుతూ బస్టాండ్, రైల్వేస్టేషన్ల వద్ద బాలబాలికలు కనిపిస్తే 1098 హెల్ప్ లైన్ నంబరుకు సమాచారం అందించాలని కోరారు. డీసీపీఓ యూనిట్ అధికారి సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.లావణ్య, కృష్ణకుమారి పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామ సభలో ఎనిమిది దరఖాస్తులు

పెదసనగల్లు(మొవ్వ): మొవ్వ మండలం పెదసనగల్లులో 1722.22 ఎకరాల్లో గతంలో నిర్వహించిన రీ సర్వే సమస్యలపై మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎనిమిది మంది రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. సభలో తహసీల్దార్ కే మస్తాన్, ఎంపీటీసీ సభ్యురాలు మట్టు శివనందిని, రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ పి.జగన్మోహనరావు, మండల సర్వేయర్ కిషోర్, వీఆర్వో కొలుసు పండిడ్ నెహ్రూ, సచివాలయ సర్వేయర్ రామశివప్రసాద్ పాల్గొన్నారు.